# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పద్మ అవార్డుల ప్రదానోత్సవం రెండవ విడత కార్యక్రమం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరగనుంది.**

2. **ప్రజల నుంచి వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**

==========================

దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం రెండవ విడత కార్యక్రమం ఈరోజు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరగనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ తెలుగు చలనచిత్ర నటులు గద్దె రాజేంద్ర ప్రసాద్, మాగంటి మురళీ మోహన్ పద్మశ్రీ పురస్కారాలను స్వీకరించనున్నారు. అలాగే తెలంగాణ నుంచి శాస్త్రవేత్తలు జి.చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, కుమారస్వామి తంగరాజ్, డెయిరీ విభాగంలో ఎం. రామారెడ్డి మరణానంతరం పద్మశ్రీ అవార్డులు అందుకోనున్నారు.

--------------------------

ప్రజల నుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో వేగంగా పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలతో సౌమ్యంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వాలని, టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించి పాలనను మరింత మెరుగుపరచాలని అన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిశుభ్రత, నీటి భద్రత, భూగర్భ జలాల సంరక్షణ, నదీ అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

--------------------------

ముందస్తు జాగ్రత్తలు, సకాలంలో వైద్య పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను చాలా వరకు నివారించవచ్చని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఒక క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వైద్య రంగంలో సాంకేతికతను వినియోగించి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యంత అవసరమని పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

తెలంగాణలో మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలోని రైల్‌భవన్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో ఆయన నిన్న సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో అపరిష్కృతంగా ఉన్న మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టు, దానికి అవసరమైన ఆర్థిక సహాయంపై చర్చించారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ, రైల్వే మంత్రితో చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. మెట్రో విస్తరణ అంశంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఈ రోజు సమావేశం కానున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా మచిలీపట్నం ధర్మాన చెరువు సుందరీకరణ పనులకు రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,అమృత్ పథకం కింద 2 కోట్ల 78 లక్షల రూపాయల వ్యయంతో ఈ అభివృద్ధి పనులను చేపడతామని చెప్పారు. మచిలీపట్నంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, మరిన్ని ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ధర్మాన చెరువును అభివృద్ధి చేసి మచిలీపట్నం నగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ..30... సెకన్లు

---------------------------

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొందించిన "ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం" ప్రత్యేక సమాచార సంచికను అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితుల వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళికలు, శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, వాతావరణ హెచ్చరికలు గ్రామ స్థాయి వరకు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఢిల్లీలో ఒక ప్రైవేటు ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొని రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ వేగం, స్థిరత్వం, సేవతో ముందుకు సాగుతోందని చెప్పారు. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25 శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌కే వస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

---------------------------

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ఈరోజు నుంచి విత్తన మేళాలు నిర్వహించనున్నామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాల సరఫరాపై విత్తన సంస్థల ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీ వరకు అన్ని రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 2 వేల 601 రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలకు అవసరమైన విత్తనాలను, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు.

---------------------------

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విస్మరించిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆరోపించారు. అనంతపురం జిల్లాలో రైతుల సమస్యలు, ఆత్మహత్యల ఘటనలపై రైతు నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, సాగునీటి కొరత, పెట్టుబడి ఖర్చులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పరిహారం అందకపోవడం వంటి కారణాలతో రైతులుఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

---------------------------

తెలంగాణ నుండి రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉందని ఇది సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..25. సెకన్లు

నైరుతి రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================